క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

పిచ్చాటూరు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పిచ్చాటూరు టౌన్‌లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో విద్యుత్ యథావిధిగా ఉంటుందని ఆయన చెప్పారు.

మామిడి సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న స్పిక్ ప్రతినిధులు

పిచ్చాటూరు: మండలంలోని ముడియూరులో గ్రీన్స్ స్టార్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ యాజమాన్యం మామిడి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించింది. శుక్రవారం ముడియూరులో కంపెనీ ప్రతినిధి ఉమా మహేశ్వర్ రెడ్డి మామిడి పంటలో సమీకృత పోషకాలు, ఎరువుల సబ్సిడీ గురించి తెలిపారు. రైతుల సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో రైతులు, స్పిక్ సంస్థ అధికారులు తిరుమల రావు, ముబారక్ సాయి పాల్గొన్నారు.

161 కొత్త పింఛన్లు మంజూరు

సత్యవేడు: మండలంలో 161 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీపీ వి. ప్రతిమ తెలిపారు. పంచాయతీల వారీగా.. ఏఎంపురం 19, ఆరూరు 6, చెరివి15, దాసుకుప్పం 18, ఇరుగుళం 8, కాళమనాయుడుపేట12, కన్నావరం 6, మనదంబేడు 3, పీవిపురం 8, పెద్ద ఈటిపాకం 6. రాజగోపాలపురం 10, సత్యవేడు-1సచివాలయంలో 11, 2వ సచివాలయంలో 17, 3వ సచివాలయంలో 5, 4వ సచివాలయంలో11, శిరునంబూదూరు 3 చొప్పున పింఛన్లు మంజూరైనట్టు ఆమె తెలియజేశారు.

బోరు మోటారు వైర్లు చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వెస్టువరత్తూరు గ్రామ పంచాయతీ బోరు మోటారు విద్యుత్ వైర్లను దొంగలు చోరీ చేశారు. శుక్రవారం ఇది వెలుగులోకి వచ్చింది. మోటారు పనిచేయకపోవడంతో వెళ్లి పరిశీలించగా దొంగలు వైర్లను కట్ చేసినట్లు గుర్తించారు. చోరీపై గ్రామ సర్పంచ్ సుప్రియ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన వీ.రాఘవరెడ్డి, వీ.రాఘవులు, భాస్కర్‌రెడ్డి పొలంలో బోరు మోటార్ల వైర్లను సైతం కట్ చేసి చోరీ చేశారు. ఫలితంగా అటు తాగునీటి సమస్యలతోపాటు ఇటు పంటలకు నీరు పెట్టే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు. చోరీకి గురైన వైర్ల విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని తెలిపారు.

ఎస్టీల అభ్యున్నతికి సహకరించాలి

ఏర్పేడు: ఎస్టీల అభ్యున్నతికి దాతలు సహకరించాలని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో ఎస్టీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో ఆర్థిక స్థోమత లేనందున పిల్లలు చదువుకు దూరంగా ఉన్నట్లు చెప్పారు. సంస్థ తరపున గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ బడుల్లో చేర్పుతున్నట్లు వివరించారు.

రేపు ఆటో యూనియన్ మహాసభ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

ఏర్పేడు: శ్రీకాళహస్తిలో ఆటో యూనియన్ మహాసభను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని పాపానాయుడుపేటలో శుక్రవారం ఆటో యూనియన్ మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలపై శ్రీకాళహస్తిలో ఈ నెల 27న జిల్లా స్థాయి మహాసభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఆటో డ్రైవర్ హాజరై సభను జయప్రదం చేయాలని సూచించారు. ఆటో యూనియన్ నాయకులు బాలాజీ, వసంత్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సురేష్



వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా కార్యవర్గంలో వరదయ్యపాళెం మండలం కంచరపాళెంకు చెందిన పార్టీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి చొరవ చూపిన స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, నియోజకవర్గ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి, జగనన్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

కేవీబీపురం నుంచి బాలసుబ్రమణ్యం..



కేవీబీపురం: తిరుపతి జిల్లా వైఎస్సార్ సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కేవీబీపురం మండలం ఓళ్లూరుకు చెందిన పార్టీ సీనియర్‌నేత పర్వతాల బాలసుబ్రహ్మణ్యంకు స్థానం లభించింది. తనకీ పదవి రావడానికి ఎమ్మెల్యే ఆదిమూలం, గవర్ల కృష్ణయ్య, నందకుమార్ కారకులని కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాళహస్తి: బ్రహ్మ గుడిలో అమ్మవారికి పూజలు చేస్తున్న వేదపండితులు



వరలక్ష్మీ వ్రతమాచరిస్తున్న భక్తులు



పూజలో బియ్యపు పవిత్రారెడ్డి



శాస్త్రోక్తం.. సామూహిక వరలక్ష్మీ వ్రతం

శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తి ఆలయంలోని బ్రహ్మగుడిలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేక పూజలు చేసి విశేషంగా పుష్పాలంకరణ చేశారు. అనంతరం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు దంపతులు, ఆలయ ఈవో సాగర్‌బాబు దంపతులు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి, పట్టణానికి చెందిన వందలాది మంది మహిళలు వరలక్ష్మీ వ్రతం పూజలు చేశారు. మండపాన్ని విశేషంగా పూలు, తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. గణపతి పూజతో వ్రతం ప్రారంభించారు. వ్రతంలో మహిళలు పసుపు, కుంకుమ, వాయినం ఇచ్చేందుకు అవసరమైన వస్తువులు, ఎర్రటి రవికె వస్త్రం, గంధం, పూలు, పండ్లు పంచహారతి, పూజా సామగ్రితో అమ్మవారికి పూజలు చేశారు. పూజ అనంతరం కంకణాలు కట్టుకున్నారు. మంత్రాలకు అనుగుణంగా ఓంనామ స్మరణ చేస్తూ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం చేయడం ఆనవాయితీ. ఈ సారి కూడా ఎంతో వేడుకగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ కైలాసగిరుల్లో పరమేశ్వరుడు తన అనుచరగణంతో మునిపుంగవులతో కలసి ఉండగా, పార్వతీదేవి స్త్రీలు సుఖ, సౌఖ్యాలతో ఉండాలంటే ఎటువంటి వ్రతాలు, పూజలు ఆచరించాలని అడగగా, శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించడం ద్వారా సమస్త కోరికలు నెరవేరుతాయని పురాణాలు చెబుతున్నట్లు వివరించారు. సర్వ మంగళ సంప్రాప్తి, సకలాభిష్టాల కోసం, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలన్న ఆకాంక్షతో మహిళలు ఈ పూజలు చేస్తారని చెప్పారు.

ఘనంగా వరలక్ష్మీదేవి పూజలు

ఏర్పేడు: మండలంలోని ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు వ్రతాలు ఆచరించారు. ఆలయ పూజారులు మహిళలకు పసుపు, కుంకుమ, పసుపు దారాలు, ప్రసాదాలు అందజేశారు.

సత్యవేడు నియోజకవర్గం

సత్యవేడు: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతమాచరించారు. మహిళలు ఆలయాలలో శ్రీలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సత్యవేడు వీరభద్రస్వామి ఆలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో దేవతా మూర్తులను విశేషంగా అలంకరించారు. మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతం, లలిత సహస్ర నామపారాయణం, అష్టలక్ష్మీ పూజలు నిర్వహించారు. గాంధీరోడ్డులోని లలితాదేవి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా చేశారు. ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి పూజలు పూజలు చేశారు. అనంతరం శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. అలాగే పల్లమాలలోని పచ్చాలమ్మకు గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలుచేసి, పూలతో అలంకరించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. 7 గంటలకు కల్యాణ వెంకన్నకు, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం పద్మావతీ అమ్మవారు ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగి, ఊంజల్‌సేవలో భక్తులను కటాక్షించారు. స్థానిక వీరరాఘవ దేవస్థానంలో ఉదయం వందమందికి పైగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతమాచరించారు. అమ్మవారికి కుంకుమార్చన చేసి వాయనాలను ఇచ్చి పుచ్చుకున్నారు. సముదాయంలోని అవనాక్షమ్మ ఆలయంలో మహిళలు పిండి దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకున్నారు.


నాగలాపురంలో ఊంజల్‌సేవ


నారాయణవనం: వీరరాఘవస్వామి ఆలయంలో..

నాగలాపురం : వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని స్థానిక శ్రీ వేదవల్లీసమేత శ్రీ వేదనారాయణస్వామి ఆలయంలో అమ్మవారికి ఆస్థానం, అభిషేక, విశేష పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయాధికారి శ్రీనివాసులు పర్యవేక్షించారు.


బుచ్చినాయుడుకండ్రిగలో


సత్యవేడు : వీరభద్రస్వామి ఆలయంలో..


సత్యవేడు : వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


బుచ్చినాయుడుకండ్రిగ: పల్లమాలలో..

సచివాలయ సర్వేయర్లకు సన్మానం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలంలోని శివనాథపాళెం, కంచనపల్లి సచివాలయం పరిధిలో పని చేస్తున్న సర్వేయర్లు వెంకటాద్రి, విజయ సేవలను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆర్డీవో కె.ఎస్.రామారావు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సర్వేయర్లకు మండల వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు శ్రీరాములు రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అల్లయ్య, గిరిరెడ్డి, కరుణాకర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


సర్వేయర్లను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హెచ్ఆర్‌ఏ 12శాతం ఇవ్వరూ!

నారాయణవనం: మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి అద్దె అలవెన్స్ చెల్లింపుల్లో జీఓ మేరకు న్యాయం చేయాలని ఎంపీడీఓ గుణశేఖర్ శుక్రవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం తిరుపతి కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలువురు ఉద్యోగులు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతులు అందజేశారు. జీఓ 27 నిబంధనల మేరకు పుత్తూరుకు 8 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు 12 శాతం హెచ్ఆర్‌ఏను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందని, ప్రస్తుతం మండలంలోని కొండల చెరువు సచివాలయ ఉద్యోగులకు మాత్రం 12 శాతం హెచ్ఆర్‌ఏ అందుతోందని, నారాయణవనం, ఎరికంబట్టు, భీముని చెరువు, కసిమిట్ట, వీకే పాలెం, కీళ్లగరం పంచాయతీలు పుత్తూరుకు 8 కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నప్పటికీ 10 శాతం మాత్రమే హెచ్ఆర్‌ఏ ఇస్తున్నట్టు కలెక్టర్‌కు నివేదించారు. సమస్యను పలుమార్లు గతంలో జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లినా న్యాయం చేయలేదని, ఇకనైనా సానుకూలంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీడీఓ గుణశేఖర్

మొక్కులు చెల్లించిన భక్తులు

నారాయణవనం: టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో శుక్రవారం ఉదయం మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులకు పులివాహన సేవ నిర్వహించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. శనివారం సాయంత్రం గజవాహన సేవ నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి తెలిపారు.



ఆశీర్వాదం



ఏర్పేడు: తిరుపతి శ్రీనివాస కల్యాణ మండపంలో నూతన వధూవరులకు గురువారం రాత్రి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆశీస్సులందించారు. ఏర్పేడు వైస్ ఎంపీపీ జమ్మళ్ల శ్రీనివాసులు కుమార్తె అఖిల, నాగరాజు వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సర్పంచ్‌లు పెంచలయ్య, జయముని, బాలప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకట్రామ నాయుడు, బాబు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ



శ్రీకాళహస్తి: చంద్రయాన్ 3 విజయవంతం చిరస్మరణీయమని ఎంజీఎం విద్యాసంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అన్నారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడంపై శుక్రవారం పట్టణ వీధుల్లో విద్యార్థులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి బాలల రేపటి పౌరులు అన్న నినాదంతో రాబోయే కాలంలో విద్యార్థులు మంచి శాస్త్రవేత్తలు కావాలని ఆకాంక్షించారు.

ఆస్పత్రి భవనం ప్రారంభానికి సిద్ధం



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నాగలాపురం: నాగలాపురంలో రూ.2 కోట్లతో నిర్మించిన నూతన ఆసుపత్రి భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సందర్శించారు. ఆసుపత్రిలోని గదులను పరిశీలించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌పై పోలీసులకు ఫిర్యాదు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకుడు నారా లోకేష్‌పై శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు మండల సోషల్ మీడియా కన్వీనర్ కేతినేని వెంగళరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ×మీ మీద కేసులు ఉంటే నామినేటెడ్ పదవులు¥ ఇస్తామని నారా లోకేష్ బహిరంగంగా టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడని గుర్తుచేశారు. వారి వైఖరిని ఎత్తి చూపేలా, శాంతి భద్రతలను కాపాడాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులకు సోషల్ మీడియా నాయకులు ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు. నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తొట్టంబేడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాఘవేంద్రకు నారా లోకేష్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కో-కన్వీనర్స్ సురాజ్, గంధం ఆనంద్, వినోద్‌కుమార్, రాకేష్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో కూడా లోకేష్‌పై ఫిర్యాదు చేశారు.


ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా కన్వీనర్ వెంగళరావు

వైభవంగా అర్జున తపస్మాన్


తపస్మాన్ ఎక్కిన అర్జున వేషధారి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ద్రౌపదీధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చేనేత సంఘం ఆధ్వర్యంలో అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు అభిషేకాలతోపాటు విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అర్జున తపస్మాన్ కార్యక్రమం కోసం ఆలయం ముందు తాటిచెట్టును ఏర్పాటు చేశారు. తపస్మాన్ వద్దకు ముందుగా పోతురాజు, అర్జునుడి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. తపస్మాన్ వద్ద సంతానం కోసం మహిళలు వరపడ్డారు. ఈశ్వరుని, అర్జునుడి వేషధారుల మధ్య సంవాదం జరిగింది. అర్జున వేషధారి శ్లోకాలు, పద్యాలు పాడుతూ తపస్మాన్ మెట్లు ఎక్కాడు. తమవెంట తీసుకుని వెళ్లిన విభూది, నిమ్మకాయలు, అరటిపండ్లును భక్తులపై చల్లాడు. వాటిని భుజిస్తే కోరిన కోర్కెలు, సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం ఆలయంలో సుమారు 1300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్తర గోగ్రహణంలో అర్జున వేషధారి గోవులు(ఆవులు)ను మళ్లించాడు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఎంపీటీసీ సభ్యుడు మునిరాజా తదితరులు పాల్గొన్నారు.


విశేషాలంకరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తి


తపస్మాన్ వద్ద వరపడిన మహిళలు